ఆర్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో కవాతు



నీలగిరి, న్యూస్‌టుడే: విజయ దశమి ఉత్సవం సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ సభ్యులు పాతబస్తీ నుంచి రవీందర్‌నగర్‌ మీదుగా ఎన్జీ కళాశాల మైదానం వరకు కవాత్‌ నిర్వహించారు. హనుమాన్‌ నగర్‌, పాతబస్తీ, హిందూపూర్‌, దోమలపల్లి, నర్సింగ్‌బట్ల, ముషంపల్లి, సావర్కర్‌నగర్‌, రామగిరి, పానగల్‌, వెంకటేశ్వరకాలనీ, చర్లపల్లి, చందనపల్లి, తదితర ప్రాంతాల నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌ సభ్యులు కవాత్‌లో పాల్గొన్నారు. ఎన్జీకళాశాల మైదానంలో నిర్వహించిన ఉత్సవంలో తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత కన్వీనర్‌ అప్పాల ప్రసాద్‌, గుండ్ల అంజిరెడ్డి సందేశం ఇచ్చారు.

వంతెన పనులు మొదలు



స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

చిట్యాల,న్యూస్‌టుడే:జాతీయరహదారిపై చిట్యాలలో పైవంతెన నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఆ పనుల్లో భాగంగా ఆదివారం ప్రధాన రహదారికి ఇరువైపులా సర్వీసుదారిలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆదివారం స్తంభాల తొలగింపు ప్రక్రియ కొనసాగింది. వర్షం నీరు వెళ్లేందుకువీలుగా నిర్మించిన కాలువను కూడా తొలగించి సర్వీసుదారికి మరోపక్కన నిర్మించనున్నారని సమాచారం.

కమిటీ కనుసన్నల్లో కొనుగోళ్లు

- ❐ రెండు రకాల ధాన్యం కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ
- ❐ పర్యవేక్షణ బృందాలతో నిత్యం తనిఖీ



ఆత్మకూర్‌(ఎస్‌) కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం (పాతచిత్రం)

సూర్యాపేట కలెక్టరేట్‌, న్యూస్‌టుడే:

సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్‌ ప్రకటించింది. ఈ బోనస్‌ను 2024-25 వానాకాలం నుంచే అమలు చేసేందుకు సర్కారు సిద్ధమైంది. అందులో భాగంగా సన్నాలు, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఆయా కేంద్రాల్లో కొనుగోళ్ల పరంగా ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో తహసీల్దార్‌, ఎంపీడీవో, ఎస్సై, ఏఈవోలు, ఐకేపీ ఏపీఎంలు, పీఏసీఎస్‌ అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌, సీఈవో, మెప్మా అధికారులు సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఈ కమిటీలకు సంబంధించి జిల్లా కేంద్రాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు.

సన్నరకాల గుర్తింపు ఇలా..

◆ సన్న ధాన్యంపై అనుమానం ఉంటే కేంద్రానికి కేటాయించిన మైక్రోమీటర్‌ ద్వారా రైతు, ఏఈవో, కేంద్ర నిర్వాహకుల సమక్షంలో ధాన్యం గింజను కొలుస్తారు.

◆ ధాన్యం పొట్టు తీసి పొడవు, వెడల్పు నిష్పత్తి లెక్కిస్తే 3 కన్నా తక్కువ ఉంటే దొడ్డురకం, ఎక్కువ ఉంటే సన్నరకం ధాన్యంగా గుర్తిస్తారు.

◆ వడ్లను మిల్లులకు తరలించే క్రమంలోనూ గన్నీ సంచులపై సన్నరకం అయితే "ఎస్‌", దొడ్డు రకం అయితే "డీ" అని గుర్తులు పెడతారు.

పచ్చిధాన్యం తేకుండా అవగాహన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో 871 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటికి తేమ కొలిచే, ధాన్యం శుద్ధి చేసే యంత్రాలు, గన్నీ సంచులతోపాటు ఈ సారి అదనంగా టార్పాలిన్లు (పట్టాలు), సన్నరకం ధాన్యాన్ని కొలిచే మైక్రోమీటర్‌ను కేటాయించనున్నారు. ధాన్యం రాకను బట్టి అదనంగా కేంద్రాలు పెంచే వెసులుబాటు కల్పించారు. అవసరం ఉన్న చోట కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు జిల్లా స్థాయి అధికారులకు తెలిపి మరికొన్ని కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. ఈసారి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు జమ చేసేలా కసరత్తు చేస్తున్నారు. సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసుకునేలా ఆయా కలెక్టరేట్లలో కంట్రోల్‌ రూం ఏర్పాటు చేయనున్నారు. కేంద్రాలను నిత్యం ఆకస్మికంగా తనిఖీ చేసేలా జిల్లాస్థాయి అధికారులతో పర్యవేక్షణ బృందాలను నియమించనున్నారు. పచ్చిగా ఉన్న పంటను కోయకుండా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి సాగు వివరాలు (ఎకరాల్లో..)

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
సన్నాలు	2,68,778	93,188	31,961
దొడ్డు	2,41,404	3,79,746	2,27,537
మొత్తం	5,10,182	4,72,934	2,59,498

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు, ధాన్యం రాక అంచనా (మెట్రిక్‌ టన్నుల్లో)

జిల్లా	కేంద్రాలు	సన్నాలు	దొడ్డు	మొత్తం
నల్గొండ	375	2,80,000	4,70,000	7,50,000
సూర్యాపేట	206	1,71,197	1,99,029	3,70,226
యాదాద్రి	290	32,363	4,00,000	4,32,363

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

–అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుచేస్తున్నాం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సన్నాల కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉన్నాం. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వారి నేతృత్వంలో అక్రమాలకు తావులేకుండా కొనుగోళ్లు నిర్వహించనున్నాం.

నిర్మాణాలు ఇష్టారాజ్యం.. పనులు అస్తవ్యస్తం



ఎత్తు తగ్గించి ఏర్పాటు చేసిన విద్యుత్తు టవర్లు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: కోదాడ నుంచి జడ్చర్ల వరకు నిర్మిస్తున్న 167 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో విద్యుత్తు లైన్ల మార్పిడి ప్రక్రియలో నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. కోదాడ-జడ్చర్ల రహదారిని పట్టణంలో వంద అడుగుల మేరకు విస్తరించాలి. దీనికి రెండువైపులా మురుగు కాల్వ నిర్మించి విద్యుత్తు స్తంభాలను పక్కకు జరిపి, నూతన విద్యుత్తు టవర్లు అమర్చి, తీగలను ఏర్పాటు చేయాల్సి ఉంది. పట్టణంలో విస్తరణ పనులకు రూ.54 కోట్లు కేటాయించారు. పట్టణంలోని ఎఫ్‌సీఐ సమీపం నుంచి రాజీవ్‌ కూడలి మీదుగా ఈదులగూడెం వరకు రహదారి విస్తరించేందుకు నిర్ణయించారు. రహదారిని మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌ రోడ్డు మీదుగా వెళ్లేలా ఏర్పాటు చేయగా.. నిబంధనల మేరకు మిషన్‌ భగీరథ పైపులైన్లు పక్కకు జరపటంతో పాటు విద్యుత్తు స్తంభాలను పక్కకు జరిపించటం, ఫుట్‌పాత్‌ నిర్మించి 7 అడుగుల మేరకు రెండువైపులా మురుగుకాల్వ నిర్మించాల్సి ఉంది.

■ పాత విద్యుత్తు స్తంభాలు మార్చి వాటి స్థానంలో 79 ఎం-6 టవర్లు, 106 ఎం-3 టవర్లు, 11 మీటర్ల స్తంభాలు 180, 9.1 మీటర్ల స్తంభాలు 66 ఏర్పాటు చేయాలని గుత్తేదారుకు అధికారులు ఒప్పందం చేశారు. రహదారి విస్తరణలో విద్యుత్తు టవర్ల మార్పిడి పనులను గుత్తేదారు పలువురు సబ్‌ కాంట్రాక్టర్లకు అప్పగించారు. సబ్‌ కాంట్రాక్టులు పొందిన వారు కనీసం నిబంధనలు పాటించకుండా విద్యుత్తు లైన్ల పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎం-6 టవర్లు వేయాల్సిన చోట ఎం- 3 వేయటంతో పాటు ఎత్తు తగ్గించి, లోపల భాగంలో దిమ్మెలు సైతం తగ్గించి నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

■ ఈ ఏడాది ఫిబ్రవరిలో పురపాలిక ఛైర్మన్‌ తిరునగరు భార్గవ అప్పటి కమిషనర్‌ పూర్ణచందర్‌, డీఈ సాయిలక్ష్మి మురుగుకాల్వ నిర్మాణ పనులను పరిశీలించి పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విస్తరణ పనులు ఒక్కో చోట ఒక్కో రకంగా జరుపుతున్నారని నిర్ణీత కొలతలు పాటించటం లేదని సైతం ఆరోపించటం సమస్య తీవ్రతకు అద్దం పడుతుంది.

నిబంధనల మేరకు చేయకపోతే బిల్లులు నిలిపివేస్తాం..

– వెంకటేశ్వర్లు, విద్యుత్తు ఏఈ

నిబంధనల మేరకు పనులు చేయకపోతే బిల్లులు చేయకుండా నిలిపివేస్తాం. ఎం-6 టవర్ల స్థానంలో ఎం- 3 టవర్లు ఏర్పాటు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై ఒప్పందం ప్రకారం పరిశీలిస్తాము. పాత తీగలు అమర్చిన విషయం ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

కమనీయం.. లలితాదేవి అలంకారం



యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి క్షేత్రంలో అనుబంధంగా కొనసాగుతున్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల నాలుగో రోజు ఆదివారం శ్రీ లలితాదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం కల్పించారు. పారాయణం, గాయత్రీజపం, లలిత సహస్రనామార్చన, మధ్యాహ్నం నీరాజనం, మంత్ర పుష్పం నిర్వహించారు. సాయంకాలం శ్రీ దేవి చతుషష్టి ఉపచారపూజ, సహస్రనామార్చన నీరాజన మంత్ర పుష్పం చేపట్టారు.

సుప్రీంకోర్టు రిటైర్డ్‌ జడ్జి ప్రత్యేక పూజలు

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: గోపలాయపల్లిలోని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి గుట్టపై ఉన్న శ్రీరుక్మిణి సత్యభామా సమేత స్వామి వారిని సుప్రీం కోర్టు రిటైర్డ్‌ జడ్జి జస్టిస్‌ ఎల్‌. నర్సింహారెడ్డి సందర్శించి ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత ఆయనకు ఆలయ ఛైర్మన్‌ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, అర్చకులు పూర్ణ కుభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చరిత్రను తెలియజేశారు. ఆర్టికల్చర్‌ కమిషనర్‌ వెంకట్‌రెడ్డి, బార్‌ కౌన్సిల్‌ ఛైర్మన్‌ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు అనంతరం సుప్రీం కోర్టు రిటైర్డ్‌ జడ్జి జస్టిస్‌ నర్సింహారెడ్డి

ఇంటి వద్దకే పింఛన్‌



లెప్రసీ కాలనీ లబ్ధిదారులు

కుష్ఠు బాధితులు పింఛన్‌ కోసం పడరాని పాట్లు పడేవారు. వ్యాధి పీడితులకు చేతివేళ్లు సరిగా లేకపోవడం.. వేలిముద్రలు వేయడానికి వీలు లేకపోవడంతో పింఛన్‌ కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. నల్గొండ సమీపంలోని లెప్రసీ కాలనీలో 36 మంది, రిక్షా పుల్లర్స్‌ కాలనీలో 50 మంది వరకు కుష్ఠు వ్యాధి బాధితులున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరి కోసం ప్రతి నెలా పోస్టల్‌ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌ అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – ఈనాడు, నల్గొండ

అంతర్జాలం.. అందనంత దూరం

◆ డిజిటల్‌ పాఠాలకు తప్పని ఇబ్బందులు



తరగతి గదిలో డిజిటల్‌ పాఠాల బోధిస్తున్న ఉపాధ్యాయుడు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో ప్రవేశపెట్టిన డిజిటల్‌ బోధనకు అవాంతరాలు తప్పడం లేదు. పథకం ప్రవేశపెట్టి రెండేళ్లవుతున్నా నేటికీ పాఠశాలలకు ఇంటర్‌నెట్‌(అంతర్జాలం) సౌకర్యం కల్పించ లేదు. ఫలితంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. మరి కొన్ని చోట్ల ఉపాధ్యాయులే తమ సెల్‌ఫోన్‌లోని హాట్‌స్పాట్‌ ద్వారా డేటా అందిస్తూ పాఠాలు బోధిస్తున్నారు.

సమస్య ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా విద్యనందించేందుకు 2022-23 విద్యాసంవత్సరంలో డిజిటల్‌ పాఠాలను ప్రవేశపెట్టారు. విద్యార్థులకు డిజిటల్‌ బోర్డుపై వీడియోలు చూపిస్తూ బోధించడం ద్వారా వారిలో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఇలా బోధన చేపట్టాలని నిర్ణయించినా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. 2023 మార్చిలో కొన్ని పాఠశాలలకు డిజిటల్‌ బోర్డులు(ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానల్స్‌-ఐఎఫ్‌పీ) మంజూరుచేసింది. అప్పటికే విద్యాసంవత్సరం పూర్తవుతుండటంతో కొన్నిచోట్ల వాటిని నామమాత్రంగా ఉపయోగించారు. మరి కొన్ని చోట్ల భద్రపరిచి 2023-24 విద్యాసంవత్సరం ఆరంభంలో ఏర్పాటుచేశారు. అదే విద్యా సంవత్సరంలో అన్ని ఉన్నత పాఠశాలలకు బీఎస్‌ఎన్‌ఎల్‌ కేబుల్‌ ద్వారా ఇంటర్‌నెట్‌ కల్పిస్తామని చెప్పారు. నేటికీ కల్పించలేదు. కొందరు ఉపాధ్యాయులు హాట్‌స్పాట్‌ ఉపయోగిస్తున్నా నెట్‌వర్క్‌ సిగ్నల్‌ లేకుంటే పాఠాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి.

రక్షణ లేక అవస్థలు

ఒక్కొక్కటి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5.50 లక్షల విలువ చేసే ప్యానల్స్‌ను పాఠశాలల్లో భద్ర పరచడమంటే ప్రధానోపాధ్యాయులకు కత్తిమీద సాములాంటిదే. అనేక పాఠశాలలు ఊరికి దూరంగా ఉండటంతో వాటికి రక్షణ లేకుండా పోతోంది. గతంలో వేసవి వచ్చిందంటే పాఠశాలల్లో కంప్యూటర్స్‌తోపాటు ఇతర సామగ్రి చోరీకి గురయ్యేవి. ఇపుడు ఇంత విలువైన ప్యానల్స్‌ను జాగ్రత్తగా ఉంచడం కష్టంగానే ఉందని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులు కాపలాదారును నియమించారు. తర్వాత ఊసే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం బీఎస్‌ఎన్‌ఎల్‌ నెట్‌వర్క్‌తో పాటు రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది.

జిల్లా	ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య	మంజూరైన ఐఎఫ్‌పీలు
సూర్యాపేట	210	644
నల్గొండ	289	875
యాదాద్రి	183	538


నేడు మార్కెట్‌ ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ వ్యవసాయ మార్కెట్‌ ఛైర్‌పర్సన్‌గా నాయిని జమున, పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం సాయిశివ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నేనావత్‌ బాలునాయక్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసన మండలి ఛైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు జానారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాల్‌ మార్కెట్‌ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్‌ బాలునాయక్‌, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ధర పెంచేసి.. రూ.లక్షలు కాజేసి

- ★ కంకర రవాణాలో కమీషన్‌ దందా
- ★ ఓ ప్రజాప్రతినిధి హస్తంపై ఆరోపణలు





ఈనాడు, నల్గొండ:

అదీ.. ఉమ్మడి జిల్లా సరిహద్దులో ఉన్న ఓ నియోజకవర్గం. సున్నపురాయి నిక్షేపాలున్న ప్రాంతం. సర్కారు చేపడుతున్న నిర్మాణాలకు రోజూ రెండు వేల టన్నుల కంకర తరలుతోంది. ఇక్కడే అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అక్రమానికి చేయిచాచాడు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే టన్ను కంకర లోడుకు రూ.200 వరకు పెంచి కమీషన్‌ దండుకుంటున్నాడు. ఈ లెక్కన నిత్యం రూ.నాలుగు లక్షల వరకు కమీషన్‌ రూపంలోనే ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ వ్యయం పెరిగి ప్రజాధనం దుర్వినియోగమవుతున్నా.. అధికార వర్గాలు మాత్రం 'చూసీ'చూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.


గతంలో తరలింపు ఇలా..

యాదాద్రి థర్మల్‌ విద్యుత్కేంద్రం (వైటీపీఎస్‌) నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంటుండటంతో జిల్లా మంత్రులు ప్రత్యేక దృష్టిసారించి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు ఇటీవలే పనుల్లో వేగం పెంచారు. ఇప్పటికే ఇక్కడ రెండు యూనిట్లు పూర్తికాగా.. త్వరలోనే మరో రెండింటినీ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైటీపీఎస్‌లో జరిగే నిర్మాణ పనులకు నిత్యం 1500 టన్నుల నుంచి రెండు వేల టన్నులకు పైగా కంకర కావాల్సి ఉంటుంది. నిర్మాణాలు, రహదారులు, ఇతరత్రా పనులకు స్థానికంగా మరో 500 టన్నుల అవసరం ఉంటుంది. ఈ పనులకు గత నాలుగైదు నెలల వరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల క్రషర్‌లతో పాటు హైదరాబాద్‌ నుంచి కంకర వచ్చేది. టన్నుకు రూ.550 నుంచి రూ.600 వరకు అధికారులు కొనుగోలు చేసేవారు.

చక్రం తిప్పారిలా..

కొన్ని నెలలుగా హైదరాబాద్‌తో పాటు స్థానికంగా ఉన్న పలు క్రషర్ల నుంచి వస్తున్న కంకరను వైటీపీఎస్‌కు సరఫరా చేయొద్దని సదరు ప్రజాప్రతినిధి హుకుం జారీ చేశారు. పక్క నియోజకవర్గంలో ఉన్న మరో పార్టీకి చెందిన ఓ భారీ మిల్లు నుంచి కమీషన్‌ తీసుకొని అక్కడి నుంచే ప్లాంటుకు కంకర తరలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ దందాతో వైటీపీఎస్‌ నిర్మాణం వ్యయం పెరిగి ప్రభుత్వంపై భారం పడుతోంది. మరోవైపు సదరు నియోజకవర్గ కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న క్రషర్లను సైతం మూసివేయించి సామాన్యుల అవసరాలకూ ఆ మిల్లు నుంచే కంకర వచ్చేలా చేస్తున్నారని అక్కడి బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల కాలంలో సుమారు ఆరు క్రషర్లు మూత పడటం విశేషం. ''నాలుగైదు నెలల వరకు టన్నుకు రూ.550 చొప్పున కొనుగోలు చేశాం. మేం తరచూ కొనుగోలు చేసే క్రషర్‌ను అధికారుల వేధింపులతో దాని యజమాని మూసేశారు. హైదరాబాద్‌ సమీపంలో నుంచి వచ్చే కంకర సైతం ఇదే ధరతో కొనుగోలు చేశాం. అక్కడి నుంచి రావొద్దని చెప్పారట. ఇప్పుడు రూ.780 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేస్తున్నాం. అయినా గతంతో పోలిస్తే నాణ్యతగా ఉండటం లేద''ని బిల్డర్స్‌ అసోసియేషన్‌ సభ్యుడొకరు 'ఈనాడు'కు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన కంకరను తక్కువ ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతం కంటే ఎక్కువ ధరకు కంకర కొంటున్న విషయమై వైటీపీఎస్‌ సీఈ సమ్మయ్యను 'ఈనాడు' సంప్రదించగా.. ఇసుక, కంకరకు తాము ఒకేసారి కాంట్రాక్టు ఇస్తామని, దీన్ని నిత్యం భెల్‌ అధికారులు, గుత్తేదారు పర్యవేక్షణ చేస్తారని, ఎంత ధరకు కొంటున్నారో తనకు తెలియ'ని వెల్లడించారు.

గొంతులో ఇరుక్కుపోతున్నాయ్ జాగ్రత్త..!



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

చిన్నారులు ఆడుకుంటూ.. తమ చేతిలో ఉన్న వస్తువులను నోట్లో పెట్టుకోవడం సర్వసాధారణం. ఒక్కోసారి ఆ వస్తువులను పొరపాటున మింగడంతో గొంతు, ఆహార నాళాల్లో ఇరుక్కుపోయి.. ఊపిరాడక మరణించిన ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. గొంతులో ఆహార పదార్థాలు ఇరుక్కున్నప్పుడు సరైన అవగాహన లేకపోవడంతో పలువురు సమస్యను జటిలం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 30 మందికి పైగా గొంతు, నాళాల్లో పదార్థాలు, వస్తువులు ఇరుక్కుని ఆసుపత్రిలో చేరుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- చిన్నారులకు గొంతులో ఇరుక్కునే పరిమాణంలో ఉండే నాణేలు, వస్తువులు ఇవ్వకూడదు.
- ఆహార నాళాల్లో అల్సర్లకు దారి తీసే అయస్కాంతం, బ్యాటరీలు, పిన్నీసులు వంటి పదునైన వస్తువులను పిల్లలకు అందుబాటులో ఉంచరాదు.
- మాంసాహారంతోపాటు గట్టిగా ఉండే పదార్థాలను మొత్తగా నమలాలి.
- క్యారెట్ వంటి ఆహార పదార్థాలను తురిమి చిన్నారులకు అందించాలి.
- పిల్లల మెడలో సన్నటి గొలుసులు, నెక్లెస్‌లు వేయకూడదు.
- చిన్నారులు ఆడుకోవడానికి నాణేలు, కాసులు ఇవ్వొద్దు.
- చిన్నారుల గొంతులో ఏదైనా ఇరుక్కుపోతే పొట్టపై రుద్దకూడదు. పొట్ట లోపల గాయాలు కావొచ్చు.
- గొంతులో ఏదైనా ఇరుక్కుపోయినట్లు అని పిస్తే తలపై తట్టకూడదు.
- గట్టిగా దగ్గడం వల్ల గొంతులో ఇరుక్కున్న వస్తువులు బయటపడే అవకాశం ఉంది.

బలవంతంగా తీయొద్దు



– డాక్టర్ మువ్వ శ్రీహర్ష, గ్యాస్ట్రో ఇంటస్టైనల్ సర్జన్, మిర్యాలగూడ

పిల్లలు, పెద్దల గొంతు, ఆహార నాళాల్లో ఏదైనా ఇరుక్కుపోయిందని గమనించిన వెంటనే బలవంతంగా తీసేందుకు ప్రయత్నించకుండా తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. సూక్ష్మ పరికరాలను ఉపయోగించి.. వస్తువు స్థితిని గమనించి.. జాగ్రత్తగా బయటకు తీయడమా.. పొట్టలోకి నెట్టడమా చేస్తాం. గత నెలలోనే నలుగురికి ఆధునిక చికిత్స ద్వారా ఇరుక్కుపోయిన వస్తువులను బయటకు తీశాం.

సంఘటనలు ఇలా..

☛ రెండేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా రాజానాయక్ తండాలో ఓ వ్యక్తి మేక మాంసం ఎముక గొంతులో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయారు.


☛ యాదాద్రి భువనగిరి జిల్లా కక్కిరేణి గ్రామానికి చెందిన వృద్ధుడికి దంతాలు లేక నమలకుండానే మాంసం ముక్క మింగారు. వైద్యులు అతి కష్టం మీద శస్త్రచికిత్స చేసి తీసేశారు.

☛ గుర్రంపోడుకు చెందిన ఓ మహిళ నాటు మందు మింగారు. అది గొంతులో అడ్డుపడగా.. నీరు తాగడంతో మరింత ఉబ్బి పోయింది. మందుముద్దను వైద్యులు ఎండోస్కోపీ ద్వారా ముక్కలుగా చేసి పొట్టలోకి తోశారు.



☛ పెద్దవూర మండలానికి చెందిన నాలుగేళ్ల బాలుడు గత నెలలో రెండు రూపాయల నాణేన్ని మింగడంతో మిర్యాలగూడలో ఆధునిక చికిత్స విధానంతో బయటకు తీశారు.

మొదలైన దసరా రద్దీ



జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి వస్తు బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌కు అప్పుడే దసరా పండగ కళ వచ్చింది. ఆదివారం రోజున స్థానిక వస్త్రాలు, గాజులు, చెప్పులు, అలంకరణ వస్తువులు విక్రయించే దుకాణాలు జనంతో కిక్కిరిశాయి. సంత కూడా ఇదే రోజున నిర్వహిస్తుండడంతో ఎక్కడ చూసినా కొనుగోళ్లు చేస్తున్న జనమే కనిపించారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్‌లో నివాసముండే ఈ ప్రాంతవాసులు కుటుంబాలతో సొంతూళ్లకు కార్లలో ప్రయాణం కావడంతో జాతీయ రహదారిపై రద్దీ ఏర్పడింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్ సంస్థలు ప్రత్యేక బస్సులు నడుపుతుండడంతో వాహనాలు బారులు తీరాయి. దీనికి తోడు సరుకుల రవాణా చేసే వాహనాలు, ఆటోలు తదితర వాహనాలు రోడ్డుపైకి రావడంతో రద్దీ పెరిగింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ రద్దీతో సమస్యలు ఏర్పడకుండా క్రమబద్ధీకరించారు. ఇదే రద్దీ దసరా పండగ వరకు కొనసాగే అవకాశముంది.

మృత్యువులా దూసుకొచ్చిన లారీ: ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

యాచారం, న్యూస్‌టుడే: కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వ్యక్తిని లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ రోడ్డు ప్రమాద సంఘటన రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా వెంకటేశ్వర నగర్ నివాసి గున్నాల భాస్కర్(45) వారాంతపు సంతల్లో చిల్లర వ్యాపారాలు చేస్తూ హోల్‌సేల్‌గా కూరగాయలు సరఫరా చేస్తాడు. నల్గొండ గట్టుప్పల్‌లో శనివారం నిర్వహించిన సంతలో కూరగాయలు సరఫరా చేసి ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. మాల్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ.. ఆటో ఢీకొట్టడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితో వస్తున్న అతని చెల్లెలు జయమ్మ, అక్క వెంకటమ్మ, ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వీరంతా ప్రమాదం పాలయ్యారు. భాస్కర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు, భార్య ఉన్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు యాచారం సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.

వీవీఐపీల విడిదికి కొండపైనే విల్లాలు



యాదాద్రిలో ప్రెసిడెన్షియల్ సూట్ల సముదాయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహ పుణ్యక్షేత్రంలో వీవీఐపీలు బస చేసేందుకు వారికి అనుగుణంగా ప్రత్యేక ప్రాంగణంలో విల్లాలు నిర్మించిన విషయం తెలిసిందే. ఈ క్షేత్రాభివృద్ధిలో భాగంగా దాతల ఆర్థిక సహకారంతో ప్రెసిడెన్షియల్ సూట్ల పేరిట 14 విల్లాలు, ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించారు. వీటికి అయిన వ్యయం రూ.104 కోట్లు దాతలు సమకూర్చినవే. యాదాద్రి కొండకింది ఉత్తర దిశలో పదమూడు ఎకరాల కొండపైన విడిది విల్లాలు ఏర్పాటయ్యాయి. భద్రత కట్టుదిట్టం కోసం రక్షణ గోడ నిర్మించారు. 14 విల్లాల్లో మొత్తం 70 సూట్లు ఉన్నాయి. ఒక్కో విల్లాలో ఐదు సూట్లు ఐదు కుటుంబాలు బస చేసేలా అవసరమైన వసతులతో వీటిని వైటీడీఏ పర్యవేక్షణలో అద్దె కిస్తారు. ఒక రోజుకు ఒక్క సూట్ అద్దె రూ.3 వేలు.


భూమిపై పెట్టుబడితో భరోసా: ఎమ్మెల్యే



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, చిత్రంలో సినీ నటులు శ్రీకాంత్, తరుణ్

చింతపల్లి, న్యూస్‌టుడే: భూమి మీద పెట్టుబడి పెడితే భవిష్యత్తులో భరోసా కలుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్ర సమీపంలో స్థిరాస్తి రంగం సంస్థలైన శ్రీమిత్ర, ఆరు ఆధ్వర్యంలో సాయి సన్నిధి వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చింతపల్లి సమీపంలోని కుర్మేడ్ నుంచి ఆర్ఆర్ఆర్ పోతుందని, సమీపంలో వైజాగ్ కాలనీ ఉండటంతో పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. సాయిబాబా దేవాలయం సమీపంలో వెంచర్ ఏర్పాటు చేసి మధ్య తరగతి వారికి ప్లాట్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్ అన్నారు. కార్యక్రమంలో శ్రీమిత్ర ఛైర్మన్ ఎం.వీ.చౌదరి, తేజ నివాస్, తేజగోవింద్, ఆరు నిర్వాహకులు రవితేజ అఖిల్, సికేందర్, శైలేందర్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, ఉజ్జిని యాదగిరిరావు, సాయిబాబా దేవాలయ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ, దొంతం సంజీవ రెడ్డి, అంగిరేకుల నాగభూషణం, ముచ్చర్ల యాదగిరి, నటుడు ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

కన్నవారి కలలు ఫలించె.. కొలువు పల్లవించె..!



నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే:

తల్లిదండ్రులు రోజువారి వ్యవసాయ కూలీలు. తాము పడుతున్న కష్టాలు పిల్లలు పడొద్దని భావించి ఉన్నత చదువులు చదివించారు. నిరంతరం శ్రమించి, వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసిన కన్నవారి ఆశయాలను గుర్తించి నెరవేర్చారు నూతనకల్ మండలంలోని పలు పల్లెల యువత. నిర్దిష్ట లక్ష్యం, ప్రణాళిక, వారికి ఇష్టమైన రంగాల్లో స్థిరపడాలన్న కోరికతో చదివి ఉద్యోగాలు సాధించారు. ఇటీవల వెలువడిన పలు ప్రభుత్వ ఉద్యోగ ఫలితాల్లో మండలంలోని యువతీయువకులు కొలువులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కోర్టు ఉద్యోగం మానేసి.. – గంట వెంకటేశ్, దిర్శన్‌పల్లి



అమ్మానాన్నలు గంట సాలయ్య-వెంకటమ్మ. రోజువారి కూలీ పనుల చేస్తూ ఎంతో కష్టపడి నన్ను చదివించారు. ఎంఏ బీఈడీ పూర్తి చేసి గ్రూప్స్‌కి తర్ఫీదు పొందా. ఇటీవల తుంగతుర్తి న్యాయస్థానంలో క్లరికల్ ఉద్యోగం సాధించా. అది మానేసి హాస్టల్ వెల్ఫేర్ కొలువుకు సన్నద్ధమై రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించా.

అమ్మానాన్న కళ్లల్లో ఆనందం చూశా.. – తన్నీరు ఉమేష్, యడవెల్లి



విద్యుత్తు శాఖలో హెల్పర్‌గా(రోజువారి కూలీ) పనిచేస్తున్న నాన్న కష్టం చూసి.. లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేశా. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పూర్తయిన అనంతరం గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యా. తర్వాత ఏఈఈగా ఉద్యోగం.. నెక్కొండలో పోస్టు వచ్చింది. అమ్మానాన్నల కళ్లల్లో ఆనందం చూశా.

పేదరికాన్ని జయించా



– రచ్చ సందీప్, చిల్పకుంట్ల

తల్లిదండ్రులు జీవనోపాధి కోసం సూరత్ వెళ్లి.. కరోనా సమయంలో స్వగ్రామానికి వచ్చారు. చేనేత కార్మికులుగా పని చేస్తూ అమ్మానాన్నలు రచ్చ వెంకటేశ్వర్లు,-నిర్మల నన్ను చదివించారు. పేదరికం నుంచి బయటపడాలని కసితో చదివి విజయం సాధించా. నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్(ఏఈఈ) ఉద్యోగం సాధించి మహబూబాబాద్‌లో విధుల్లో చేరా.

సొంత జిల్లాలో కొలువు



– నామాల భవాని, చిల్పకుంట్ల

వ్యవసాయ కళాశాలలో చేరి ఇంజినీరింగ్ చేస్తున్నప్పుడే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ప్రణాళికలు వేసుకొని లక్ష్య సాధనకు కృషి చేశా. అమ్మానాన్నల ప్రోత్సాహంతో ముందుకు సాగాను. ఏఈఈ ఉద్యోగం సాధించి ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో విధుల్లో చేరా. సొంత జిల్లాలో పనిచేస్తున్నందుకు ఆనందంగా ఉంది.

తల్లిదండ్రుల కల నెరవేర్చా



– రాచమల్ల శ్రావణి, పెదనెమిల

అమ్మానాన్నలు రాచమల్ల శ్రీనివాస్, లక్ష్మీలకు ముగ్గురు ఆడపిల్లలం. నాకు రెండేళ్ల కిందట వివాహమైంది. 'పెద్ద కుమార్తెవు.. విజయం సాధిస్తే చెల్లెల్లకు ఆదర్శంగా నిలుస్తావు' అన్న అమ్మానాన్నల మాటలు.. భర్త ప్రోత్సాహంతో ముందుకు సాగాను. ఏఈఈ కొలువు సాధించి సొంత మండలంలోనే విధుల్లో చేరా. తల్లిదండ్రుల కల నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది.

పట్టుదలతో సాగితే విజయం ఖాయం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టుదలతో, శిక్షకుల సహకారంతో ముందుకు సాగితే విజయాలు ఖాయమని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు 24 మ్యాచ్‌లు జరుగుతాయని, ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

★ మెదక్ జట్టు నిజామాబాద్, హైదరాబాద్ జట్లతో రెండు మ్యాచ్‌ల్లో పోటీ పడగా మెదక్ విజయం సాధించింది. సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. * ఖమ్మం-నిజామాబాద్ జట్ల మధ్య పోటీలో నిజామాబాద్, కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్గొండ విజయాలు సాధించాయి. రంగారెడ్డి - నల్గొండ జట్ల మధ్య పోటీ టై అయింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి రహమాన్ అలీ



మోత్కూరులో సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా చింతల పురస్కారం అందుకుంటున్న రహమాన్ అలీ(పాతచిత్రం)

మోత్కూరు, తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఒకేవ్యక్తి అనేక రంగాల్లో ప్రతిభ కనబర్చడం కొందరికే సాధ్యం. ఆ కోవకు చెందిన వారు తిరుమలగిరి మండలకేంద్రానికి చెందిన మహ్మద్ రహమాన్ అలీ. క్రీడోపాధ్యాయుడిగా ఈయన చాలాకాలం మోత్కూరులో పనిచేసి, అక్కడే ఉద్యోగ విరమణ పొందారు. రంగస్థల నటుడిగా, దర్శకుడిగా, ప్రయోక్తగా అనేక నాటకాలు, నాటికలు ప్రదర్శించి మన్ననలు అందుకుంటున్నారు. సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమంలో భాగంగా ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాల్లో అనేక ప్రదర్శనలిచ్చి ప్రజలను అక్షరాస్యత వైపు మళ్లించారు. మద్యపాన నిషేధ కమిటీ ఆధ్వర్యంలో నాటకాలు, ఉపన్యాసాలతో జనాల్లో చైతన్యం తీసుకొచ్చారు. స్కౌట్ మాస్టర్‌గా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ పసిఫిక్ జాంబూరి, యూనియన్ క్యాంపు, బ్యాడ్జ్ శిక్షణలో పాల్గొని మాజీ ప్రధాన మంత్రి మొరార్జీదేశాయ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. రచయితగా, చిత్రకారుడిగా అనేక సామాజిక అంశాలపై బొమ్మలు గీసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు.

నిరక్షరాస్యులను నటులుగా తీర్చిదిద్ది

ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీలో ఆధునిక నటనలో శిక్షణ పొందిన రహమాన్ అలీ చదువురాని స్థానిక గ్రామీణులను నటులుగా తీర్చిదిద్దారు. వారితో కలిసి 'అన్నాచెల్లెలు, కీర్తిశేషులు, విషాదాంతం, పల్లెపడుచు, పూలరంగడు, నీలిదీపాలు' వంటి నాటకాలు, పశ్చాత్తాపం, చీకటి తెరలు, అంతర్వాణి, వెంకన్న కాపురం, ఊబి, కళ్లు, ఛాయ, ఊరుమ్మడి బతుకులు తదితర నాటికలను కడప, హైదరాబాద్ రవీంద్రభారతి, తదితర చోట్ల ప్రదర్శించారు. దొరోరి బంగ్లా, కొడుకు పుట్టిండు నాటికలు దూరదర్శన్‌లో, 'ప్రేమ పక్షులు' నాటకం రేడియోలో ప్రసారమయ్యాయి. రాష్ట్ర, అఖిలభారత స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చిన ఆయనకు ఎన్నో పురస్కారాలు లభించాయి. పరుచూరి బ్రదర్స్, సినీ నటుడు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, దాసరి నారాయణరావు, తదితర సినీ ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 'నటన, ఆటల్లో తర్ఫీదు ఇవ్వడం తనకెంతో ఇష్టమని, అందుకే అనేక మందిని ఆయా రంగాల్లో తీర్చిదిద్దాన'ని రహమాన్ అలీ తెలిపారు.

ధనలక్ష్మి అవతారం.. కరెన్సీ నోట్ల అలంకారం



చౌటుప్పల్‌లో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ఆదివారం ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. నిర్వాహకులు రూ.45 లక్షల విలువైన కరెన్సీ నోట్లను పోగు చేసి దండలుగా మార్చి అమ్మవారిని, మండపాన్ని అలంకరించారు. హారతి పళ్లెంలో నోట్ల కట్టలను పేర్చారు. ఎటు చూసినా 100, 200, 500 రూపాయల నోట్లు కనిపించేలా తీర్చిదిద్దారు. - చౌటుప్పల్, న్యూస్‌టుడే



అప్పాలు కాల్చేదెలా..!

భానుపురి, న్యూస్‌టుడే:

వంట నూనెల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. పండగ సమయంలో సామాన్య కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచడంతో ఆయా కంపెనీలు ధరలను గణనీయంగా పెంచేశాయి. పది, పదిహేను రోజుల వ్యవధిలో నూనెల ధరలు కిలోకు రూ.20-రూ.30 వరకు పెరిగాయి.

పెంపు ఇలా..

గత నెల 13న కేంద్రం ప్రభుత్వం వంట నూనెల దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచింది. దీంతో లీటర్ పొద్దుతిరుగుడు రూ.135, పామోలిన్ రూ.125కు చేరింది. గత నెల 13న పోలిస్తే ఒక్కో లీటర్‌పై రూ.20 వరకు పెరిగింది. మరికొద్ది రోజుల్లో మరో రూ.5 వరకు పెరిగే అవకాశముంది. పెంపు విషయంలో పలు కంపెనీలు సంయమనం పాటించగా కొన్ని మాత్రం పెంచేశాయి.

మన నూనెలకు ధరలు

మన దేశంలో ఉత్పత్తయ్యే వేరుసెనగ, సోయాబీన్ తదితర నూనెల ధరలు విదేశీ ఉత్పత్తులతో సమానంగా పెరిగాయి. సెప్టెంబరు 10 వరకు లీటర్ రైస్‌బ్రాన్ నూనె ప్యాకెట్ రిటైల్ ధర రూ.120 వరకు ఉండగా ప్రస్తుతం రూ.135కి పెంచారు. వేరుసెనగ నూనె ధర రూ.150కు నుంచి రూ.155 వరకు పెరిగింది. దిగుమతి సుంకం పరిధిలోకి రాని దేశీయ నూనెల ధరలను సైతం పెంచడంతో సామాన్యులకు భారంగా మారింది.

దీనికి అధికం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కువగా పొద్దుతిరుగుడు నూనె వినియోగిస్తారు. గృహ, వాణిజ్య అవసరాలకు ప్రతి నెలా 4200 మెట్రిక్ టన్నుల వివిధ రకాల వంట నూనెలు వాడుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. అత్యధికంగా పొద్దుతిరుగుడు 2600 మెట్రిక్ టన్నులు, పామోలిన్ 900 ఎంటీలు, వేరుసెనగ, తవుడు, ఇతర నూనెలు 700 ఎంటీలు ఉంటాయి. రోజువారీగా మారుతున్న ధరలను పరిగణనలోకి తీసుకుంటే భారం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

ఆడదూడలు పుట్టేలా.. కృత్రిమ గర్భధారణ



నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

కృత్రిమ గర్భధారణ(ఏఐ)తో ఆడదూడలే పుట్టేలా చేస్తున్న ప్రయోగాలు ఉమ్మడి నల్గొండ జిల్లాలో విజయవంతమయ్యాయి. లింగ నిర్ధారిత వీర్య నాళికలతో పశుగణాభివృద్ధి సంస్థ ఈ ఘనత సాధించింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి 58 ఆడదూడలు పుట్టాయి. తక్కువ ఖర్చుతో 90 శాతం కచ్చితత్వంతో అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడదూడలు పుట్టించి పాడి రైతుల ఆదాయం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో గత ఏడాదిలో లింగ నిర్ధారిత కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ పథకంలో 2078 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. ఈ విధానంలో 90 శాతం ఆడ దూడలు పుట్టే అవకాశం ఉంది. ఆడ దూడల సంఖ్య పెరిగితే పాల దిగుబడి వృద్ధి చెంది పశుపోషకులకు ఆదాయం సమకూరుతుంది.

ఉమ్మడి జిల్లా వివరాలు..

★ ఆడదూడలు పుట్టేలా కృత్రిమ గర్భధారణ (ఏఐ) చేసిన పశువులు: 2078
★ ఇప్పటికి చూడిదాల్చినవి: 1183
★ ప్రస్తుతం పుట్టిన ఆడదూడలు: 58
★ ఏఐతో లభ్యమయ్యే జాతులు: గేదెలు ముర్రా, ఆవుల్లో సాహివాల్, హెచ్.ఎఫ్, జెర్సీ

మూడేళ్లకే పాల దిగుబడి..


ఆడ దూడ 18 నెలలకే చూడికి వస్తుంది. మూడేళ్లకే దూడకు జన్మనిస్తుంది. దీంతో రైతుకు కేవలం మూడేళ్లకే పాల దిగుబడి ప్రారంభమై ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పథకానికి జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నోడల్ మానిటరింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం లింగ నిర్ధారణ వీర్యం కలిగిన స్ట్రా‌ని రైతులకు రాయితీపై అందిస్తోంది. ధర రూ.675 కాగా రైతు వాటాగా రూ.250 చెల్లించాలి.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

–ఎం.రాజశేఖర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి, నల్గొండ

పశువులకు లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేస్తే మేలు జాతి దూడలు జన్మిస్తున్నాయి. వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే అధిక వ్యయమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గేదెలు ఇక్కడి వాతావరణానికి సర్దుబాటు కాకపోవడంతో పాల దిగుబడి తగ్గుతోంది. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడానికి ఇది అనువైన కాలం. డీఎల్‌డీఏ ద్వారా చేపట్టే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

చికెన్ ధరలు



ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

నల్గొండ
• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు నష్టం

నీలగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతో బీసీలకు తీరని నష్టం జరుగుతుందని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జనాభాప్రాతిపదికన విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, నాయకులు బోళ్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

శాలిగౌరారం, న్యూస్‌టుడే: నకిరేకల్ నుంచి శాలిగౌరారం మీదుగా అమ్మనబోలు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని శాలిగౌరారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డెంకెల సత్యనారాయణగౌడ్ కోరారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల ప్రజలకు ఆర్టీసీ బస్ సౌకర్యం లేక ఎంతో వ్యవప్రయాసాలకు ఓర్చి ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. పండగల సీజన్ కావడంతో వివిధ ప్రాంతాల్లో ఉన ఉన్నవారు స్వస్థలాలకు చేరుకోవడానికి ఆర్టీసీ అధికారులు నకిరేకల్ నుంచి అమ్మనబోలు, నకిరేకల్ నుంచి గురజాల వరకు షటిల్ బస్సులను నడిపించాలని విజ్ఞప్తి చేశారు

పోటీ పరీక్షల పుస్తకాలు అందజేత

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్, వాసవి సేవా సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత స్టడీ హాల్‌కు దాత సింగరి రాములు పోటీ పరీక్షల పుస్తకాలను ఆదివారం అందజేశారు. తన కుమారుని స్మారకార్థం వీటిని అందజేశానని దాత వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద అభ్యర్థుల కోసం ఉచిత స్టడీహాల్ నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మదేవర నరేశ్ పాల్గొన్నారు.


నకిరేకల్: పుస్తకాలు అందజేస్తున్న దాత రాములు

ఆస్ట్రేలియాను వదిలి..
వినూత్నంగా రాణిస్తూ..

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే:

సొంతంగా వ్యాపారం చేస్తూ, మరో నలుగురికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆస్ట్రేలియాలో ఉద్యోగం వదిలిపెట్టి ఇక్కడే స్థిరపడాలనుకున్నాడు ఓ యువకుడు. హైదరాబాద్‌కు చెందిన గట్ల నరేందర్ ఆస్ట్రేలియాలో ఎంబీఏ పూర్తి చేశాడు. ఆ తర్వాత పలు సంస్థల్లో మేనేజర్‌గా పని చేశారు. 2021 వరకు అక్కడే ఉన్న ఆయన ఆ తర్వాత స్వస్థలానికి వచ్చాడు. తిప్పర్తికి చెందిన యువతిని వివాహం చేసుకోవటంతో ఇక్కడే ఏదైన కొత్తగా వ్యాపారం మొదలు పెట్టాలని భావించాడు. అనుకున్నదే తడవుగా మాడ్గులపల్లి మండల సమీపంలో పది ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు.

స్వశక్తితో ఎదగాలని: గట్ల నరేందర్

ఆస్ట్రేలియాలో ఎంబీఏ పూర్తి చేసి, అక్కడే పలు కంపెనీల్లో మేనేజర్‌గా పనిచేశాను. ఇతరుల వద్ద పని చేయటం కన్నా.. సొంతంగా వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చింది. ఇతర దేశాల నుంచి వచ్చిన వారు అనేక రకాల వ్యాపారాలు చేస్తూ.. లాభాలు పొందుతున్నారు. కానీ నాకు చిన్నప్పటి నుంచి పాడిపశువులను సాకటం ఇష్టం. అందుకోసమే వారందరి కన్నా.. భిన్నంగా ఉండాలనే ఉద్దేశంతో పాడిగేదెల పోషణ, గొర్రె పొట్టేళ్ల పెంపకం మొదలు పెట్టాను. ఇలా తాను సొంతంగా వ్యాపారం చేయాలనే కల సాకారం అయినందుకు సంతోషంగా ఉంది.


గేదెలకు దాణా వేస్తున్న నరేందర్

సుమారు రూ.కోటి వరకు ఖర్చు చేసి గొర్రెపొట్టేళ్ళ, పాడిగేదెలు, నాటుకోళ్లు, కౌంజు పిట్టల పెంపకం మొదలుపెట్టాడు. వాటికి ప్రత్యేకంగా షెడ్లు(ఆవాసం) ఏర్పాటు చేశాడు. 200 గొర్రెపొటేళ్ళ, పది హరియాణ జాతికి చెందిన గేదెలు, నాటు కోళ్ల ద్వారా మాంసం, పాల ఉత్పత్తులను విక్రయిస్తూ ఆర్థిక అభివృద్ధి పొందుతున్నాడు. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారి వెంట టీ స్టాల్ కూడా ఏర్పాటు చేసుకున్నాడు. ప్యాకెట్ పాలకు స్వస్తి చెప్పి, తన ఫామ్‌లోని గేదెల నుంచి తీసిన పాలనే వినియోగిస్తూ టీ, కాఫీలు అందిస్తున్నాడు.

నేడు కంటివైద్య శిబిరం.. నకిరేకల్: ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులకు నకిరేకల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఈ నెల 7న నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంటల రామలింగం, కందుల సోమయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య కార్డులతో హాజరు కావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని హైదర్‌ఖాన్‌గూడలో మురుగు కాల్వలు పేరుకుపోయాయి. దుర్వాసన వ్యాపిస్తోంది. శుభ్రం చేయించాలి – ఖాదర్,నల్గొండ.

✔ పరిశీలించి వెంటనే కాల్వలు శుభ్రం చేయిస్తాం .– శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.


మురుగు కాల్వ శుభ్రం

స్పందనకు వందనం

శాలిగౌరారం, న్యూస్‌టుడే: శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెంలో మురుగు కాల్వలను తీయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తుందని దీంతో దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని 'ఈనాడు'లో ఈనెల 5న 'మురుగు తొలగించండి' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ సిబ్బందితో ఆదివారం గ్రామంలో, రోడ్డు పక్కన ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయించి వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించారు

అమలు చేయాలి కట్టంగూరు: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సత్వరమే అమలు చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మునుకుంట్ల పరిధి అకులాయిగూడెంలో ఆదివారం జరిగిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో మాట్లాడారు. జిల్లాలోని పల్లెలను కలిపే రహదారులకు మరమ్మతులు చేయాలని కోరారు. మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, గోనె కమలాకర్‌రావు, జాల రమేష్ పాల్గొన్నారు.

రహదారిపై ప్రమాదకరంగా ఇసుక


పెద్దగడియారం సమీపంలో రోడ్డుపై పేరుకు పోయిన ఇసుక

నీలగిరి, న్యూస్‌టుడే: వాహనదారులు ఆదమరిచి వచ్చారో ప్రమాదానికి గురికావాల్సిందే. నిత్యం రోడ్డు శుభ్రం చేయాల్సిన పురపాలిక సిబ్బంది ప్రధాన రోడ్లపైన పేరుకు పోయిన ఇసుకను ఎప్పటికప్పుడు తీయక పోవడంతో అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దగడియారం సమీపంలోని రాష్ట్రపతి రోడ్డులో గల ఎల్ఐసీ కార్యాలయం వద్ద వర్షం వచ్చిన ప్రతి సారి ఇసుక పేరుకపోతుంది. లతీఫ్ షా ఖాద్రీ దర్గా గుట్ట పై నుంచి వచ్చే వరద నేరుగా కాలువద్వారా పోకుండా రోడ్డుపైకి రావడంతో ఇసుక నిలిచిపోయింది. పురపాలిక సిబ్బంది వెంటనే తొలగించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రోడ్లపైన ఇలా ఉంటే మారుమూల కాలనీల్లో పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

తిప్పర్తి: ఇటీవల కాలంలో ఎక్కువగా యువత గంజాయికి బానిసగా మారుతున్నారని, మాదకద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ఏఎస్సై దుర్గారెడ్డి అన్నారు. మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో గంజాయి వల్ల జాగృతి పోలీస్ కళాజాత బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాజాత బృందం సభ్యులు మూఢనమ్మకాలు, సైబర్ నేరాలపై పాటలు పాడుతూ, ఆటలు, నాటికల రూపంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కొన జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

నడక దారికి అడ్డుగా.. వాహనాలు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ మినీస్టేడియం ప్రహరీ రెండు చోట్ల కూలిపోయింది. సాయి మందిరం వైపు వర్షాలకు కూలిపోగా, ప్రధాన ద్వారం వైపు ఉన్న ప్రహరీని అసెంబ్లీ ఎన్నికల ముందు ఒక రాజకీయ పార్టీకి చెందిన జాతీయ నాయకుని బహిరంగ సభకు వచ్చే కార్యకర్తల సౌకర్యం కోసం కొంత మేరలో కూల్చివేశారు. ఈ ప్రాంతంలో మళ్లీ గోడను నిర్మించలేదు. ఇక్కడి నుంచి ప్రైవేట్ వాహనాలను స్టేడియం లోపలికి తీసుకొచ్చి నడక దారికి అడ్డుగా ఉదయం నుంచి రాత్రి వరకు పార్కింగ్ చేస్తున్నారు. నడక, వ్యాయామాలకు వచ్చే వారికి వాహనాలు అడ్డుగా ఉండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. స్టేడియంలోకి వాహనాలు రాకుండా కూలిన చోట్ల ప్రహరీ పునః నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


నకిరేకల్: కూలిన మినీస్టేడియం ప్రహరీ, నడక దారికి అడ్డంగా నిలిపిన వాహనాలు

★ సమస్యను పుర ఛైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ కూలిన చోట మళ్లీ నిర్మించే విధంగా కృషిచేస్తానని స్టేడియం కమిటీ అధ్యక్షుడు రాచకొండ శ్రీధర్ చెప్పారు.

తప్పిపోయిన తల్లీకూతుళ్లు

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని హైదర్‌ఖాన్‌గూడ ప్రాంతానికి చెందిన తల్లీకూతురు కలిసి శనివారం ఇంటి నుంచి బయటక వెళ్లి తిరిగి రాక పోవడంతో అత్త మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆమె మానసిక స్థితి సరిగ్గా లేక పోవడంతో పాటు భర్తతో కుటుంబ పరమైన గొడవలు పెట్టుకుని ఇంట్లో నుంచి వెళ్లినట్లు సీఐ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

క్రైం రిపోర్ట్

శాలిగౌరారం, న్యూస్‌టుడే: మండలంలోని ఆకారంకు చెందిన టిప్పర్ డ్రైవర్ శెనిగ నాగరాజు ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి గల కారణాలను తెలుసుకొని కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు కిరణ్ డిమాండ్ చేశారు. నాగరాజు ఉరివేసుకునే ముందు తీసిన సెల్ఫీ వీడియోలో క్రషర్ మిల్ యజమాని వెంకన్న డిజిల్ దొంగతనం అంటగట్టడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని ఉరి వేసుకోవడం బాధాకరమన్నారు. నాగరాజు ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్య తీసుకోవాలని కిరణ్ పోలీస్ అధికారులను కోరారు

గంజాయి విక్రయిస్తున్న నిందితుడి అరెస్టు

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి నార్కట్‌పల్లి శివారులో విద్యార్థులకు విక్రయిస్తున్న ఓ యువకుడిని నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండల కేంద్రంలోని ద్రోనమరాజు నగరానికి చెందిన సాగి దిలీప్‌వర్మ జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్‌లో రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి.. కొంత మేర అక్కడే విక్రయించగా.. మిగిలిన 650 గ్రాముల గంజాయిని శనివారం ఉదయం ద్విచక్రవాహనంపైన నార్కట్‌పల్లి శివారులోని స్పెక్ట్రా వెంచర్‌కు తీసుకొచ్చి ఓ కళాశాల విద్యార్థులకు, ఇతర వ్యక్తులకు చిన్నచిన్న పొట్లాల్లో నింపి విక్రయించడానికి సిద్ధం అయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఘటన స్థలికి చేరుకున్న ఎస్సై క్రాంతి కుమార్, సిబ్బందికి అతడు అనుమానాస్పదంగా కనిపించాడు. నిందితుడిని విచారించగా ఎనిమిది పొట్లాల్లోని సుమారుగా రూ.16,500 విలువగల గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరిపైన కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వివరించారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు చంద్రగిరి విల్లాస్ కాలనీకి వెళ్లే దారి వద్ద శనివారం అర్ధరాత్రి సమయంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా పడి 15 మంది గాయాల పాలైన విషయం తెలిసిందే. స్వల్పగాయాలు అయిన వారు జనరల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఆదివారం వారి స్వస్థలాలకు వెళ్లారు. తొమ్మిది నెలల గర్భవతి ప్రైవేటు ఆసుపత్రి చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన బాచ్చిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డికి కాలు, చెయ్యి ఇరిగి తీవ్రగాయాలు అయినట్లు రూరల్ ఎస్సై సైదాబాబా తెలిపారు. అతి వేగంగా వచ్చి బస్సు బోల్తా కొట్టడానికి కారణమైన కరీంనగర్‌కు చెందిన డ్రైవర్ పుంద్రా మనోహర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆగి ఉన్న కార్లను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న సూర్యాపేటకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పెద్దకాపర్తి శివారులోని రోడ్డు వెంట పక్కపక్కనే ఆగి ఉన్న రెండు కార్లను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. కారులో ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రపు అవినాశ్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు అవినాశ్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ మిట్టపల్లి శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.ధర్మా తెలిపారు.

గొలుసు దుకాణంపై దాడి, మద్యం స్వాధీనం

మర్రిగూడ: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి పల్లెల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలుంటాయని ఎస్సై రంగారెడ్డి హెచ్చరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మండల పరిధిలోని బీమనపల్లి గ్రామంలోని ఓ కిరాణం వ్యాపార సముదాయంలో మద్యం అమ్మకాలు జరుగుతుండగా దాడి చేసి పట్టుకున్నామని ఈ దాడుల్లో 12 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, నరేందర్, రమేష్ తదితరులు ఉన్నారు.


పట్టుబడిన మద్యంతో ఎస్సై రంగారెడ్డి

మునుగోడు నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే


నాంపల్లి : మాజీ జడ్పీటీసీ సభ్యుడు కర్నాటి రామలింగం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండటంతో పాటు పోలీస్ స్టేషన్ సైతం వాటితో పాటే ఉండాలని, కూరగాయల సంత, మాంసహారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పండ్ల మార్కెట్ కూడా ఒకే చోట పెద్ద స్థలంలో ఏర్పాటయ్యేలా చేస్తానని, మునుగోడును సుందరీకరణగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. అధిక నిధులు రావాలంటే మున్సిపాలిటీతోనే సాధ్యమవుతుందని అతిత్వరలో మునుగోడు మున్సిపాలిటీ కాబోతుందన్నారు. మునుగోడు మండల కేంద్రంలో పలు వీధులను ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు. ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించి అక్కడికి చేరుకున్న బస్సును చూసి అందులో ఉన్న ప్రయాణికులతో కాసేపు ముచ్చటించారు. ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అన్ని పాఠశాలలు ఒకే చోట ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేద్దామన్నారు. నాయకులు నారబోయిన రవి, జాల వెంకన్న, బీమనపల్లి సైదులు, పాల్వాయి జితేందర్‌రెడ్డి, మేకల ప్రమోద్‌రెడ్డి, కర్నాటి స్వామి, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, ఎండీ అన్వర్, భాస్కర్, యాదగిరి, మిర్యాల వెంకన్న పాల్గొన్నారు.

నాంపల్లి: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్నాటి రామలింగం, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దండిగ వెంకటయ్య కుటుంబాలను ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారాస రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎలుగోటి వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, వెంకటయ్య, సంజీవరెడ్డి పాల్గన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 10వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించిన నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నకాపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెలిమినేడు పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి ఆదివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేయనున్న ప్రాంతంలో పెరిగిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగించి చదును చేయించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. డైరెక్టర్లు గంగాపురం భాస్కర్, బోయపల్లి స్వామి, రైతులు పాల్గొన్నారు.


చిన్నకాపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెలిమినేడు పీఏసీఎస్ ఛైర్మన్ రఘుమారెడ్డి, రైతులు

యువతలో నైపుణ్యాభివృద్ధికి కృషి

నకిరేకల్, న్యూస్‌టుడే: యువతలో నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి తమ సంస్థలు కృషిచేస్తున్నాయని సత్యసాయి సేవా సంస్థల యువజన మహిళా విభాగ్ రాష్ట్ర సమన్వయకర్త నాగజ్యోతి చెప్పారు. నకిరేకల్‌లోని సత్యసాయి మందిరంలో ఉమ్మడి జిల్లా సత్యసాయి యువజన సమ్మేళనంలో ఆదివారం మాట్లాడారు. యువత కోసం వివిధ రంగాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. 2025లో సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, యువజన పర్తియాత్ర విజయవంతం కోసం యువజన వలంటీర్లు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా కన్వీనర్ దేవరశెట్టి శ్రీనివాసులుసాయిరాం, నకిరేకల్ కన్వీనర్ గర్రె శ్రీనివాస్, నాగమణి, రాష్ట్ర ప్రతినిధి ఎన్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిని వెలిగిస్తున్న రాష్ట్ర సమన్వయకర్త నాగజ్యోతి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నల్గొండ: పదోతరగతి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండలోని మమత ఉన్నత పాఠశాల 2007-2008 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక ఐఎంఏ హాల్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల వ్యవహర్త యానాల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆనంద్, స్వామి, లక్ష్మణ్, నగేష్, ఖలీమ్, రవి, శ్రీరామ్, వెంకటేశ్వర్లు, సునిత, సుల్తానా, ప్రభావతి, రాధిక తదితరులు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ శివరంజని విద్యామందిర్ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత ఒక చోట చేరిన చిన్ననాటి మిత్రులు తమ పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ భూపతి సత్తయ్య, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు చౌగోని శ్రీను, నరేందర్, పి.వెంకన్న, కె.కవిత, సునీత, నవ్య, స్వర్ణలత, ఏ.సంతోశ్, కె.వెంకన్న, శ్రావణ్, ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.


నకిరేకల్: పూర్వ విద్యార్థులు

భక్తి శ్రద్ధలతో దుర్గామాత పూజలు


కనగల్: దర్వేశిపురం ఆలయంలో..


లక్ష్మీనగర్ కాలనీలో అమ్మవారి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తదితరులు


కనగల్: అన్నపూర్ణ దేవిగా అమ్మవారు


నకిరేకల్: కాళీమాత ఆలయంలో..


చిట్యాలలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి జిల్లా వ్యాప్తంగా అభిషేకాలు, పూజలు సామూహికంగా నిర్వహించారు. అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ అమ్మవారు అన్నపూర్ణ దేవిగా పూజలందుకున్నారు.

న్యూస్‌టుడే బృందం:


కేతేపల్లి మండలం గుడివాడలో..


శాలిగౌరారం: మాధారంలో పూజలు చేస్తున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, భక్తులు


శ్రీనగర్ కాలనీలో..


నార్కట్‌పల్లిలో..

వైభవంగా కల్యాణం

కట్టంగూరు, న్యూస్‌టుడే: కట్టంగూరులో శ్రీకంఠ మహేశ్వరస్వామి-సురమాంబదేవి కళ్యాణం ఆదివారం తెల్లవారుజామున వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, తదితరులు ప్రత్యేక పూజలు జరిపారు.


హాజరైన భక్తులు

ప్రత్యేక పూజలు

గట్టుప్పల: దుర్గాదేవి నవరాత్రులలో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం జడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్నాటి వెంకటేశం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజు లలితా త్రిపుర సుందరిదేవి అవతారంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మాజీ వైస్ ఎంపీపీ అవ్వారు శ్రీనివాస్, బొడిగె వెంకటేశం, కిశోర్, విష్ణు, షణ్ముఖి, పురుషోత్తం, చంద్రమౌళి పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు


లండన్‌లో యూకే తెలుగు అసోసియేషన్ నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం


తిప్పర్తి: కేశరాజుపల్లిలో పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలు



నియామకం.. నార్కట్‌పల్లి గ్రామీణ: బీఎస్పీ (బహుజన్ సమాజ్ పార్టీ) నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జిగా నార్కట్‌పల్లికి చెందిన **కత్తుల కాన్షీ రామ్** నియమితులైనట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాన్షీ రామ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

అవీ ఇవీ

నీలగిరి: నల్గొండలో ఆదివారం స్థానిక ఎంఎస్ గార్డెన్‌లో ది నల్గొండ మిర్యాలగూడ రోడ్డు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పున్న పవన్‌కుమార్ , గౌవర అధ్యక్షుడు ఇబ్రహిం, సలహాదారులు జూలకంటి సైదిరెడ్డి, కోశాధికారి రామకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులుగా 16 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ డానియల్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జూకూరి రమేశ్, కౌన్సిలర్ బోగరి అనిల్‌కుమార్, టూటౌన్ ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ఆర్టీఐ రక్షక్ సంస్థ జిల్లా అధ్యక్షుడిగా చిట్యాలకు చెందిన కూనూరు మధు నియమితులయ్యారు. ఈమేరకు ఆసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సతీశ్ నియామక ఆదేశాలు ఆదివారం విడుదలచేశారు. సహచట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు కృషిచేస్తానని మధు పేర్కొన్నారు.

చిట్యాల: సర్వాయి పాపన్న గీత కార్మికుల సంఘం నియోజకవర్గ, మండల బాధ్యులను ఆదివారం చిట్యాలలో ఎన్నుకున్నారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు పరిటాల రవిగౌడ్ ఆధ్వర్యంలో చిట్యాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడుగా కొంపల్లి శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కాసుల సత్యనారాయణగౌడ్, మండలాధ్యక్షుడుగా పంతంగి వెంకన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు శంకర్‌గౌడ్ ఎన్నికయ్యారు.

ఐద్వా కార్యవర్గం.. నకిరేకల్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నకిరేకల్ మండల అధ్యక్షురాలిగా చెన్నబోయిన నాగమణి, కార్యదర్శిగా బహురోజు ఇందిర, పట్టణశాఖ అధ్యక్షురాలిగా పన్నాల శశికళ, కార్యదర్శిగా రాంపెల్లి ఇందిర, మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఆదివారం ఎన్నికయ్యారని ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా కమిటీలో స్థానం.. కేతేపల్లి: పీఆర్టీయూ జిల్లా కమిటీ కార్యవర్గంలో కేతేపల్లి మండలానికి చెందిన ఏడుగురు ఉపాధ్యాయులకు స్థానం లభించింది. జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కనుకుంట్ల వెంకటరెడ్డి, అక్కెనపల్లి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులుగా కన్నె శివయ్య, తన్నీరు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులుగా తీగల డేవిడ్, రాజా రమేష్, మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా కుంట్ల సబిత ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీకి ఎన్నికైన ఉపాధ్యాయులను పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జెల్ల రమేష్, మండలానికి చెందిన రాష్ట్ర, జిల్లా బాధ్యులు అభినందించారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** శ్వాగ్, **పీవీఎన్:** రామ్‌నగర్ బన్నీ
నకిరేకల్: **రామకృష్ణ**- శ్వాగ్, **వెంకటేశ్వర**- దేవర

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలి

పెద్దవూర, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే మాదిగలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని, ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాతే తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల భర్తీచేయాలని ఎమ్మార్పీఎస్ నల్గొండ జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దవూర మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత భారత సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పును ఆగస్టు 1న వెలువరించిందన్నారు. నరేందర్, వెంకటయ్య, ప్రసాద్, సైదులు, వెంకన్న తదితరులున్నారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని అశోక్‌నగర్‌లో రోడ్డు వెంట ఖాళీ స్థలంలో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం.- హరీష్, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే:

? పీఏపల్లిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. చిన్నారులు, మహిళలు వీధుల్లో తిరగలేకపోతున్నారు. సమస్య పరిష్కరించాలి. -అల్లుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పీఏపల్లి

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -చంద్రమౌళి, ప్రత్యేకాధికారి, పీఏపల్లి

సొగసు చూడతరమా..!

దేవరకొండ బస్టాండ్ నుంచి బాలికల ఉన్నత పాఠశాల, ఎంఈవో కార్యాలయం, వడ్డెరవీధి పాఠశాల, హనుమాన్ దేవాలయానికి వెళ్లే రహదారి దుర్గంధంగా మారింది. పాఠశాల ముందు మూత్ర విసర్జన చేయడం, నిరాశ్రయులను అక్కడే వదిలి వెళ్లిపోవడం, హోటళ్ల నుంచి మురుగుకాల్వల ద్వారా వచ్చే వ్యర్థాలు ఒకే చోట నిల్వ ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులతో



పాటు హనుమాన్ దేవాలయానికి వెళ్లే భక్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పురపాలిక కమిషనర్ భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా పర్యవేక్షణ చేపట్టి శుభ్రం చేయించడంతో పాటు బ్లీచింగ్ వేయిస్తామని తెలిపారు. -దేవరకొండ, న్యూస్‌టుడే:

పండగకైనా దీపాలు వెలిగేనా..?



రాత్రివేళలో వెలగని దీపాలు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: జడ్చర్ల నుంచి కోదాడ వరకు గల 167 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సుమారు నాలుగేళ్ల క్రితం కొండమల్లేపల్లి పట్టణంలో సుమారు ఐదు కి.మీ. వరకు రూ. లక్షలు వెచ్చించి విభాగినిల మధ్యలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు. దేవరకొండరోడ్డులో తహసీల్ కార్యాలయం నుంచి కొలుముంతలపహడ్ గ్రామం వైపు సుమారు ఒక కి.మీ. సాగర్‌రోడ్డులో చిన్నఅడిశర్లపల్లి సమీపంలో ఒక కి.మీ. వరకు దీపాలు ఏర్పాటు చేసినా నుంచి నేటి వరకు వెలగలేదు. జాతీయ రహదారి కావడంతో నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాలు వెళ్తుంటాయి. హైమాస్ట్ దీపాలు వెలగని అంధకారం అలముకుంటుంది. పలు చోట్ల ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అధికారుల పర్యవేక్షణాలోపం, గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల హైమాస్ట్ దీపాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు

ఎమ్.శ్రీనివాస్‌రెడ్డి, పట్టణవాసి

రాత్రి వేళలో హైమాస్ట్ దీపాలు వెలగడం లేదని ఎంపీడీవో కార్యాలయంలో, ఎన్‌హెచ్ 167 అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. రాత్రి వేళలో అంధకారంలో ఇబ్బందులు పడుతున్నాం.

వెలిగేలా చూస్తాం

రమేష్‌బాబు, డీఈఈ, ఎన్‌హెచ్167

వివిధ సాంకేతిక కారణాల వల్ల కొన్ని హైమాస్ట్ దీపాలు వెలగడం లేదు. వెంటనే మరమ్మతులు చేయించి.. వీలైనంత త్వరగా వెలిగేలా చూస్తాం.

పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

దేవరకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని దేవరకొండ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నర్సింహ, అంకం చంద్రమౌళి కోరారు. దేవరకొండ సేవాసదన్ భవనంలో ఆదివారం జరిగిన ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే నాలుగు వాయిదాల కరవు భత్యం చెల్లించాలన్నారు. పీఆర్సీ ఫిట్‌మెంట్ ప్రస్తుత ధరలకు అనుగుణంగా 25 శాతం చెల్లించాలన్నారు. పంగనూరి లింగయ్య, కంచర్ల నారాయణరెడ్డి, గంగిడి దామోదర్‌రెడ్డి, ఐజాక్ తదితరులున్నారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** శ్వాగ్
విట్రోస్: మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం, శ్వాగ్

'ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే'

దేవరకొండ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేవరకొండ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్.కనకారావు, బొడ్డుపల్లి వెంకటరమణ, ఎ.డి.మైనుద్దీన్, తూం బుచ్చిరెడ్డి, పోలె వెంకటయ్య, అచ్చయ్య తదితరులున్నారు.

హామీలు అమలు చేయాలి: సీపీఎం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడలో నిర్వహించిన పలు వార్డు మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై పార్టీ కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు వార్డుల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, పాండు, అయూబ్, మంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



మిర్యాలగూడలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 2004-2005 బ్యాచ్ బకాల్‌వాడ పాఠశాల విద్యార్థులు

దామరచర్ల, న్యూస్‌టుడే: దామరచర్ల మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 1994-95 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి పాఠశాలలో చదివిన నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన, విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఉపాధ్యాయులు వి.మహేశ్వర్‌రెడ్డి, డి.ఇంద్రసేనారెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, వి.నిర్మల, ఎస్ ఉత్తర్కర్, డి.చంద్రకళ, విద్యార్థులు వి.శ్రీనివాసరెడ్డి, జి.విజయ్‌రెడ్డి, సోమిరెడ్డి, బి.సైదులు, వెంకటేశ్వర్లు, వెంకటేష్, రతన్, సౌజన్య, నాగేశ్వరరావు, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలోని జడ్పీ ఉన్నత పాఠశాల, బకాల్‌వాడలో 2004-05 బ్యాచ్ పదో తరగతి చదివిన విద్యార్థులు 'పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని' నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులంతా ఒక్క చోట చేరి పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



దామరచర్లలోని పాఠశాలలో అప్పటి విద్యార్థులు, ఉపాధ్యాయులు



చింతపల్లిలోని సాయి దేవాలయంలో పూజలు చేస్తున్న సినీ నటుడు శ్రీకాంత్

మరో శిర్డీగా సాయి దేవాలయం: శ్రీకాంత్, తరుణ్

చింతపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శిర్డీ సాయిబాబా దేవాలయం మరో శిర్డీగా మారుతోందని సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్ అన్నారు. మండల కేంద్రంలోని సాయి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతపల్లిలోని సాయిబాబా దేవాలయం గురించి వినడమే తప్ప ఇప్పటి వరకు చూడలేదని అన్నారు. దేవాలయంలోకి అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక భావన ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీకాంత్, తరుణ్‌ను శాలువాలతో సన్మానించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వురె కృష్ణయ్య, శ్రీనివాస్, పుల్లారెడ్డి, కాశీనాథ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



మిర్యాలగూడ వాసవీ కాలనీలో నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్-మాధవి దంపతులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మిర్యాలగూడలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గాంధీనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కాలనీలోని మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్-మాధవి దంపతులు.. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్ రెడ్డి, రేపాల శ్రీనివాస్, గుండా నాగరాజు, పాల్వాయి సురేష్, అభి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చండీహోమం.. మిర్యాలగూడ: శ్రీ దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో ఆదివారం రైల్వేకాలనీ శ్రీసాయిదత్త ఆశ్రమంలో శ్రీ చండీహోమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు పీసపాటి లక్ష్మీగణపతిశాస్త్రి పర్యవేక్షణలో సామూహికంగా చండీహోమం చేపట్టారు. 12 రకాల హారతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీనివాస్, నరేందర్, ప్రతాప్, కోశాధికారి మట్టయ్య, సోమన్న, జగన్నాధరావు, జానకిరాముడు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



మిర్యాలగూడ గాంధీనగర్‌లో అన్నపూర్ణ దేవి..

డిండి: మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. పులువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పున్న దినేష్, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: స్థానిక సాగర్‌రోడ్డులో గల వాసవీ మాత ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ, పట్టణ, మండల, యువజన ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నవరాత్రి ఉత్సవాలకు సహకరించిన దాతలు ఆకుతోట లక్ష్మీణారాయణ, జూలూరు శంకర్, తదితరులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సంఘం ప్రతినిధులు నీల లక్ష్మయ్య, రాచమళ్ల నర్సింహ, బూర్గు కుమార్, పట్టణాధ్యక్షుడు ధనయ్య, ప్రధానకార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

దేవరకొండ: దేవి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ దేవస్థానం కమిటీ నుంచి అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని కోరుకుంటూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చింతపల్లి: మండలంలోని చింతపల్లి, తీదేడు, పి.కె. మల్లేపల్లి, వెంకటేశ్వరనగర్, కుర్మపల్లి, తక్కళ్లపల్లితోపాటు పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత ఉత్సవాలను ఆదివారం మూడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు దుర్గామాత లలితా త్రిపుర సుందరీ దేవిగా పుష్పాలతో అలంకరించారు.

మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని చిల్లాపురం గ్రామంలో గ్రామస్థులంతా శ్రీకనకదుర్గ అమ్మవారి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు, గ్రామస్థులంతా స్వీకరించి అమ్మవారిని దర్శించుకున్నారు.



డిండిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

హాలియా: మండలంలో ఉత్సవాల్లో భాగంగా శ్రీలలితా త్రిపురసుందరీదేవీ అలంకరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నిడమనూరు: నిడమనూరు మండలం కేంద్రంలోని నారమ్మగూడెం, బంకాపురం, తుమ్మడం, రేగులగడ్డ, పార్వతిపురం, ముకుందాపురం, ఊట్కూరు, నందికొండవారిగూడెం గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

అడవిదేవులపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మహిషాసురమర్ధని ఆలయంలో కనకదుర్గ అమ్మవారు లలితా త్రిపుర సుందరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

చికిత్స పొందుతూ హమాలీ మృతి



పరమేష్‌గౌడ్

చింతపల్లి, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని గొడుకొండ్లలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . మండలంలోని గొడుకొండ్లకి చెందిన పాలకుర్ల పరమేష్‌గౌడ్(45) గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పరమేష్‌గౌడ్ కుమారుడు సాయి కొన్ని నెలల క్రితం గొడుకొండ్ల రిజర్వాయర్ ముందు టీ దుకాణం ఏర్పాటు చేశాడు. దీంతో హమాలీ పని చేయకుండా కుమారుడికి తోడుగా ఉండేందుకు టీ దుకాణంలో ఉంటున్నాడు. పది రోజుల క్రితం పరమేష్‌గౌడ్ పురుగు(గడ్డి)మందు తాగాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ శతాబ్ది ఉత్సవాలు మిర్యాలగూడ ఎన్నెస్పీ క్యాంపు మైదానంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రాంత కార్యకారణి సదస్సులు రాంపల్లి మల్లికార్జున్ ఉత్సవాలలో పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లవుతున్న సందర్భంగా ఏడాది పాటు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వందేళ్ల కాలంలో ఎంతో మంది స్వయం సేవక్‌లను తయారు చేయటంతో పాటుగా పలు కీలక సందర్భాల్లో పాలుపంచుకున్నారన్నారు. అంతయ్య, శ్రీనివాసరావు, కరుణాకర్, జనార్దన్, సుధాకర్, నాగరాజు, జగన్మోహన్‌రావు, డాక్టర్ నాగేందర్, అశోక్ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో స్వయం సేవకులు భారీ ర్యాలీ నిర్వహించారు.



మిర్యాలగూడ పట్టణంలో ఆర్ఎస్ఎస్ ప్రదర్శన

అవీ ఇవీ

క్రికెట్ పోటీలు ప్రారంభం.. డిండి: మండల కేంద్రంలో డిండి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు ఎస్సై రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశన్న, ఏటీ కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, కలీం పాల్గొన్నారు.

చరవాణులు అందజేత..కొండమల్లేపల్లి: ఇటీవల మండల కేంద్రంలో వివిధ రకాలుగా చరవాణులను పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ ఆప్‌లో వివరాలు నమోదు చేసి చరవాణులను దొంగిలించిన వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకుని వాటిని ఆదివారం బాధితులకు అందజేశారు. ఎస్సై రాంమూర్తి మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. హేమునాయక్, భాస్కర్ తదితరులున్నారు.

ఎన్నిక.. గుర్రంపోడు: గుర్రంపోడు మండల భారాస అధ్యక్షుడిగా నాగులవంచ తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు దర్వేశ్‌పురంలో ఏర్పాటైన పార్టీ సమావేశంలో ఆయన ఎన్నికను ధ్రువీకరించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి నోముల భగత్ ఆదేశాల మేరకు ఎన్నిక జరిగినట్లు పార్టీ నాయకులు ప్రకటించారు.

విరాళం అందజేత.. మిర్యాలగూడ: మిర్యాలగూడ రామచంద్రగూడెం కూడలిలో నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి శ్రీవేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళం అందజేశారు. మిర్యాలగూడ పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం చేపడుతుండగా దాతలు జటావత్ రాము, మాదాసు హనుమయ్య, గోలి యాదగిరి రూ.లక్ష చెక్కును కమిటీ ప్రతినిధి కౌన్సిలరు ఉదయభాస్కర్‌కు ఆదివారం అందజేశారు.

ఆర్థికసాయం.. మాడ్గులపల్లి: మండలంలోని పాములపహాడ్‌కి చెందిన దొంతగాని శైలజ పదిరోజుల క్రితం ట్రాక్టర్ ప్రమాదంలో మరణించింది. ఆగామోత్కూర్ ప్రభుత్వ పాఠశాల పదోతరగతి స్నేహితులు ఆమె దశదిన కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించేందుకు సహాయంగా రూ.27వేల రూపాయలను అందజేశారు. శ్రీను, సురేశ్, రాకేశ్, సైదులు, ప్రియాంక, శైలజ, లలిత పాల్గొన్నారు.

కోలాట బృందానికి చీరల పంపిణీ.. దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లిలో కోలాటం శిక్షణ పొందుతున్న మహిళలకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు కొర్ర రాంసింగ్ ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. మైనంపల్లి ఎంపీటీసీ పరిధిలో సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ ధ్యేయమన్నారు. వెంకట్, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి.. చింతపల్లి: మండలంలోని వర్కాల, ఘడియగౌరారం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని భారాస మండల యూత్ ప్రధాన కార్యదర్శి వందనపు ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రెండు గ్రామాల పరిధిలో సుమారు 127 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉందన్నారు.

సన్మానం.. మిర్యాలగూడ: వైద్యారోగ్యశాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఓంకారమ్మను మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. విద్యానగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వీరకోటిరెడ్డి, లలిత, హాతిరాం, సోము సైదిరెడ్డి పాల్గొన్నారు.

దసరా వచ్చింది.. వెలుగులు తెచ్చింది

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గత ఆరునెలలుగా అంధకారంలో మగ్గిపోతున్న గ్రామాలకు దసరా కొత్త వెలుగులు తెచ్చింది. వీధిదీపాలు చెడిపోయి ఇంతకాలం చీకట్లో ఉన్న గ్రామాల్లో దసరా సందర్భంగా గత వారం రోజులుగా కొత్త వీధిదీపాలు అమర్చుతున్నారు. దీంతో గుర్రంపోడు మండలంలోని 38 గ్రామపంచాయతీల్లో ఏడు వేల కొత్త వీధిదీపాలు అమర్చుతుండటంతో రాత్రి వేళ వీధులు వెలుగులు విరజిమ్ముతున్నాయి. గతేడాది దసరా సందర్భంగా వేసిన దీపాలు ఆరునెలల్లోపే మాడిపోయాయి. వాటికి తక్షణమే మరమ్మతులు చేయించటం లేదా కొత్త బల్బులు వేయించాల్సిన పంచాయతీలు ఆ విషయం మరిచిపోయాయి. మండల కేంద్రమైన గుర్రంపోడులోనూ ఆరునెలలుగా అంధకారమే ఉందంటే అర్థం చేసుకోవాలి పరిస్థితి ఎంత తీవ్రంగా ఉండేదో. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల పాలనలో వీటిపై శ్రద్ధచూపలేదు. పంచాయతీలకు నెల నెలా రావాల్సిన నిధులు రాకపోవటంతో తామేమీ చేయలేకపోయామని పంచాయితీ కార్యదర్శులు చెప్పారు. దసరా సందర్భంగా తప్పనిసరిగా వీధిదీపాలు వేయాలన్న సంప్రదాయం చాలాకాలంగా ఆనవాయితీగా వస్తోంది. దీంతో గ్రామపంచాయతీల్లో సమస్య కనుమరుగైంది.



కొప్పోలు వీధుల్లో వెలుగులు విరజిమ్ముతున్న వీధిదీపాలు